ప్రజాశక్తి
సోమవారం 13 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం

నేటి నుంచి ఎఫ్ఎ-2 పరీక్షలు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎఫ్ఎ-2 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహించనున్న ఈ పరక్షలు రోజుకు రెండు చొప్పున నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కాల నిర్ణయ పట్టిక విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విడతల వారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మండల రీసోర్స్ కేంద్రం నుంచి క్లస్టర్ పాఠశాలలకు, ఆయా క్లస్టర్ పాఠశాలల నుంచి పాఠశాలలకు ప్రశ్నపత్రాలను జిల్లా పరీక్షల విభాగం అందిస్తుంది. విద్యార్థులు సమాధానాలు రాసేందుకు ప్రభుత్వం అందించిన పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాల్సి ఉంది. ఈ విధానాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఆయా పుస్తకాల్లోనే సమాధానాలు రాసేందుకు విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ ఆధ్వర్యాన ఎఫ్ఎ-2 పరీక్షలు నిర్వహిస్తారు.

ఎం-23 జీడితో మెరుగైన ఆదాయం

- సాగుకు ప్రోత్సహిస్తే రైతుకు మేలు
- కంబోడియాలో అధిక దిగుబడులు

తీర ప్రాంతం రైతులకు జీడి పంట అంటే ఆర్థిక బలం, జీవనాధారం. కానీ, గత కొన్నేళ్లుగా దిగుబడి తగ్గిపోవడం, ముడి జీడిపప్పు నాణ్యత బలహీనపడటం వల్ల రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్దానంలో కంబోడియాలో సాగుచేస్తున్న ఎం-23 రకం జీడి ప్రోత్సహిస్తే రైతులకు సిరులు కురిపిస్తుందని వర్తక సంఘాలు అంటున్నాయి. ఈ రకం జీడి ఉత్పత్తి ప్రస్తుతం స్థానిక రకాల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉందని, సాగు ప్రోత్సహిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని ఇటీవల కంబోడియాలో పర్యటించిన బృందం స్పష్టం చేస్తోంది.

ప్రజాశక్తి- కవిటి

ఎం-23 పిక్కలు

ఆంధ్రప్రదేశ్ కాష్యూ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎపిసిఎంఎ) సభ్యుల సమాచారం మేరకు ప్రస్తుతం రాష్ట్రంలోని స్థానిక జీడి ఎకరాకు సగటున 0.5 టన్నుల ముడి జీడిపప్పు (ఆర్సిఎన్) దిగుబడి వస్తోంది. అదే సమయంలో కంబోడియాలో సాగుచేస్తున్న ఎం-23 రకం ఎకరాకు 1.5 టన్నుల వరకు దిగుబడి ఇస్తోందని వారు తెలిపారు. మన రైతులు ఎం-23 రకం చెట్లను సాగు చేస్తే ఉత్పత్తి మూడు రెట్లు పెరుగుతుంది. అదే సమయంలో రైతుల ఆదాయం, పరిశ్రమ లాభాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ఎపిసిఎంఎ అధ్యక్షుడు ఫని రాఘవులు తెలిపారు.

పరిశీలిస్తున్న బృందం (ఫైల్)

ముడి జీడిపప్పు కొరత - పరిశ్రమల ఆందోళన

ఉద్దానం తీరప్రాంతం జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల కేంద్రం. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ ప్రాంతంలోనే దాదాపు 350 యూనిట్లు పనిచేస్తున్నాయి. కానీ, ముడి జీడిపప్పు కొరత కారణంగా వీటిలో సగం యూనిట్లు కేవలం 50-60 శాతం సామర్థ్యంతోనే నడుస్తున్నాయి. రోజుకు సుమారు 60,000 కిలోల జీడిపప్పు ఉత్పత్తి అవుతున్నా... అవసరానికి సరిపడే 80-100 వేల టన్నుల ముడి జీడిపప్పు స్థానికంగా లభించడంలేదు. ఈ కారణంగా పరిశ్రమలు ఘనా, ఐవరీ కోస్ట్, బెనిన్, టాంజానియా, ఇండోనేషియా వంటి దేశాల నుంచి అధిక ధరలకు జీడిపప్పు దిగుమతి చేసుకుంటున్నాయి. దీంతో దిగుమతి ఖర్చు పెరగడం వల్ల లాభాలు తగ్గిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక ఉత్పత్తి పెరిగితేనే పరిశ్రమలు నిలబడతాయని ఎపిసిఎంఎ ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు చెప్పారు.

శాస్త్రవేత్తల దృష్టి ఉండాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రభుత్వ వ్యవసాయ విభాగం ఈ రకంపై పరిశోధన చేయాలని ఎపిసిఎంఎ సభ్యులు కోరుతున్నారు. 'కంబోడియా రకం విత్తనాలను సాంకేతికంగా అనుకూలంగా మార్చి మన నేలలకు సరిపోయే విధంగా పెంచితే, అది రైతు దశ తిరుగుదలకు దారితీస్తుంది" అని రాఘవులు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.2 లక్షల హెక్టార్లకు పైగా జీడి సాగు ఉంది. అందులో 40-50 శాతం చెట్లు 25 ఏళ్ల కంటే పాతవి. పాత చెట్ల దిగుబడి తగ్గిపోవడంతో పంట ఆర్థికంగా లాభదాయకంగా ఉండడం లేదు. ఎం-23 వంటి అధిక దిగుబడి రకాలను ప్రవేశపెట్టి, పాత తోటలను పునరుద్ధరిస్తే రైతులకు కొత్త ఆశలు తీరవచ్చని వ్యాపారవేత్తలు సూచిస్తున్నారు.

కంబోడియా - కొత్త వాణిజ్య భాగస్వామి

ఇటీవల వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎపిఇడిఎ), ఆల్ ఇండియా కాష్యూ అసోసియేషన్ (ఎఐసిఎ) ఆధ్వర్యాన భారత ప్రతినిధి బృందం కంబోడియా పర్యటించింది. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య జీడిపప్పు వాణిజ్య సహకారాన్ని పెంచే మార్గాలను పరిశీలించారు. కంబోడియా ప్రస్తుతం ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్సిఎన్ ఉత్పత్తిదారుగా ఉంది. 'ఆ దేశం నుంచి విత్తనాలు, సాంకేతిక పరిజ్ఞానం తీసుకుని మన రాష్ట్రానికి అన్యాయిస్తే, ఉద్దానం మళ్లీ జీడి రాజధానిగా వెలుగొందుతుంది' అని ఎఐసిఎ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎం-23తో మెరుగైన ఫలితాలు

జీడిపప్పు పంటతో ఒకప్పుడు ఉద్దానం రైతులు సుఖశాంతులతో గడిపారు. కానీ, ఇటీవల మార్కెట్ అస్థిరత, దిగుబడి తగ్గుదల వల్ల నిరుత్సాహం నెలకొంది. ఎం-23 రకంతో కచ్చితంగా ఈ సమస్యను అధిగమించవచ్చు. దీనిపై అధ్యయనం కోసమే కంబోడియా వెళ్ళింది. అక్కడ పరిస్థితులు చూస్తే మనకంటే మూడు రెట్లు అధిక దిగుబడి ఎం-23 రకం జీడిలో వస్తోంది. దీన్ని మన ప్రాంతానికి అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రోత్సహిస్తే అటు రైతులకు ఇటు వ్యాపారులకు కచ్చితంగా మెరుగైన ఫలితాలు ఉంటాయి.

- మల్లా కాంతారావు,
ఎపిసిఎంఎ ఉపాధ్యక్షుడు, పలాస

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలిని సుందరంగా తీర్చిదిద్దాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు. మేజర్ పంచాయతీ టెక్కలిలో చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్, పారిశుధ్యం డ్రైవ్‌ను కార్యదర్శి ఎ.వి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక పారిశుధ్య పనులతో అన్ని కాలువల్లోని పూడికలు తీయించడం, పబ్లిక్ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయించడం, చెత్తకుప్పలను తొలిగించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రక్షిత తాగునీటి సరఫరా అన్ని వీధుల్లో సక్రమంగా అందజేయాలన్నారు. టెక్కలి టౌన్‌లో ప్రతి వీధిలోనూ విద్యుత్ లైటు వెలిగేటట్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డపై సంచరించే కుక్కలను, పశువులను నియంత్రించాలని ఆదేశించారు. ప్రధాన రోడ్డలో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టి టెక్కలి పంచాయతీ ఆదాయం పెంపుదలకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డపై అకారణంగా చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించాలన్నారు. కొత్త ఇళ్లకు ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఉన్న ఇంటి పన్నులను సక్రమంగా వసూలు చేయాలన్నారు. పంచాయతీకి రావలసిన ఆశీలు, పన్నులు సెస్‌లు సక్రమంగా వసూలు చేయాలన్నారు. పంచాయతీ దుకాణాల బహిరంగ వేలం ద్వారా వచ్చిన అద్దెలను క్రమబద్ధీకరించి అవినీతికి ఆస్కారం లేకుండా పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించాడనికి కృషి చేయాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోటబొమ్మాళి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ... అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరితగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 13న జిల్లాకు రానున్నట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పౌర సరఫరాలశాఖపై కలెక్టరేట్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించే ప్రాంతీయ సమావేశంలో అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొంటారని తెలిపారు.

జెడ్‌పి సమావేశ మందిరంలో మధ్యాహ్నం మూడు గంటలకు మిల్లర్స్ అసోసియేషన్, ధాన్యం సేకరణ సంస్థలు, రైతు సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

బాలికలే దేశ భవిష్యత్

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న వెంకటస్వామి

డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.అనిత అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఎస్సి, ఎస్టి, బిసి మహిళా కళాశాల వసతి గృహంలో డాక్టర్ మేరీకేథరిన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల పై లింగ వివక్షత చూపరాదని అన్నారు. సేవ్ గర్ల్-చైల్డ్ భావనతో ప్రతిఒక్కరూ వ్యవహరించాలన్నారు. బాలికలు, బాలుర నిష్పత్తి సమానం గా ఉండేలా చూడాలని తెలిపారు. బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పించడానికి, లింగ వివక్షత రూపుమాపడానికి, మహిళా సాధికారతకు పోరాటం అనేది బాలికాదినోత్సవం ముఖ్య లక్ష్యమని అన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.మోహినీరత్నకుమారి మాట్లాడుతూ బాలికల్లో పోషకాహార లోపం, మానసిక ఆరోగ్యం (ఒత్తిడి, గృహ హింస, పనిభారం), లైంగిక ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. స్త్రీలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కల్పించాలని తద్వారా కుటుంబ, సమాజ, దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ బాలికల ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యతను కలిగి ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ఎస్సి, ఎస్టి, బిసి మహిళా కళాశాల వసతి గృహాల సంక్షేమ అధికారులు ప్రమీల, సరితా, శ్రీదేవి, పూర్ణ, పిహెచ్ఎన్ బి.లక్ష్మి, ఎస్.అరవింద, డెమో విభాగపు సిబ్బంది సతీష్, పైడి కీర్తి, ఆనంద్, ఎన్ఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: బాలికలే దేశ భవిష్యత్ అని జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారి మేరీ కేథరిన్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా మహిళా కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలి

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర డాక్టర్స్ ఫోరం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురుపాం హాస్టల్‌లో 200 మంది పిల్లలు వైరల్ హెపటైటిస్‌తో బాధపడుతున్నారని, ఇదే ప్రాంతంలో పక్కన ఉన్న పాఠశాలలో ముగ్గురు పిల్లలు మృతి చెందారని తెలిపారు. గుంటూరు సర్వజన ఆస్పత్రిలో 70 మంది ఫుడ్ పాయిజన్‌తో బాధపడుతున్నారని చెప్పారు. పిహెచ్‌సిs వైద్యులు సమ్మెలో ఉన్నారని, మరోవైపు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయన్నారు. 108, 104, ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలకు దూరమయ్యాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినా, రూ.2,700 కోట్లు బకాయిలు ఉన్నా ప్రభుత్వంలో స్పందన లేదని విమర్శించారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తా రు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రైవేట్‌కు అప్పగిస్తే వారికి సామాజిక బాధ్యత ఉండదన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు అవగాహన లేదని, ప్రెస్‌మీట్‌లో చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎర్రన్న విద్యా సంకల్పం మాక్ టెస్ట్‌కు స్పందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆర్ఆర్‌బి, గ్రూప్-డి అభ్యర్థుల కోసం కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌ను నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో ఆదివారం నిర్వహించారు. 120 మంది విద్యార్థులు మాక్ టెస్టుకు హాజరయ్యారు. ఆర్ఆర్‌బి, గ్రూప్-డి ప్రధాన పరీక్షకు సన్నద్ధం చేసే దిశగా మాక్ టెస్ట్‌ను రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి నిర్వహించారు. పరీక్ష సరళిని ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి ప్రశ్నాపత్రం రూపొందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. మాక్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు.. భవిష్యత్‌లో ప్రధాన పరీక్షల్లో ప్రతిభ చూపి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి చేరువ చేసే మార్గాలను దగ్గర చేస్తున్నామని చెప్పారు. డిఎస్సి, గ్రూప్స్, కానిస్టేబుల్, ఆర్ఆర్‌బి ఇలా పోటీ పరీక్షలన్నింటికీ సమాయత్తం చేసేలా యువతను సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సైతం యువత తరలివస్తున్నారని తెలిపారు. మాక్ టెస్టులు నిర్వహించడం, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించడం, నిష్ణాతులతో తరగతులు చెప్పించడం, పరీక్షకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఎర్రన్న సంకల్పం లక్ష్యమని చెప్పారు.



మాక్ టెస్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నేటి నుంచి 'సూపర్ జిఎస్‌టి' ఉత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు 'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్' ఉత్సవాలను నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పలు విభాగాలు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు జిఎస్‌టి వల్ల కలిగిన సేవింగ్స్‌ను చూపించడానికి ప్రతి స్టాల్‌లో గత, ప్రస్తుత జిఎస్‌టి ధరలు, సేవింగ్స్ శాతం వివరాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆటోమొబైల్స్ స్టాల్స్ ఏర్పాటుకు రవాణా శాఖ, ఎలక్ట్రానిక్స్, కిచెన్ వస్తువులు, మొబైల్ ఫోన్ల స్టాల్స్‌కు కమర్షియల్ టాక్స్ విభాగం, మున్సిపల్ కమిషనర్, ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద ఎపిసిఒ, లేపాక్షి సంస్థలు, పొందూరు చేనేత, ఇత్తడి, హస్తకళల వస్తువులు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. సోలార్ పరికరాలు ఎనర్జీ శాఖ ఆధ్వర్యంలో, ఫుడ్ కోర్టులు ఫుడ్ సేఫ్టీ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా సామగ్రి స్టాల్స్, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉత్పత్తులు ఆకట్టుకునేలా ఉండనున్నాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, జిఎస్‌టి మార్పులతో సేవింగ్స్ ప్రయోజనాలను తెలుసుకోవాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 కాల్ చేయొచ్చని తెలిపారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకటన
మహారాజశ్రీ సోంపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
O.S 45/2024
గోరు రాజేశ్వరి .....వాది
మరియు
ఉగ్రపల్లి రామలక్ష్మి వగైరాలు .....ప్రతివాదులు
To
O.S.45/2024 D3 గురుజు హేమలత. w/o నరసింగు గార్కి I.A. 99/24, I.A. 100/24, I.A. 101/24 పిటీషన్లలో రెస్పాండెంట్లు
R3 గురుజు హేమలత, W/o నరసింగు,
R4 ఉగ్రపల్లి వెంకటరమణ, S/o లేటు బాలరామ్
R5 ఉగ్రపల్లి శ్రీనివాసరావు, S/o లేటు బాలరామ్
R6 రట్టి వెంకటరావు, S/o లేటు అప్పన్న
R7 రట్టి బాలాజీ, S/o వెంకటరావు
R8 జావన భవాని, W/o మహేష్ గార్లకు
పై నెంబరు దావా పార్టీషను చేయించ కోరి వాది ప్రతివాదులు పై దావా తేగా ఈ నెంబరు దావాలో 3వ ప్రతివాదికు కావలసినయున్న దావా నోటీసు పేపరు పబ్లికేషన్ మూలంగా అమలు కాబడుటకున్నూ మరియు దావా దర్శిల 2వ ప్రతివాది కాలం చేయగా ఆమె వారసులను చేర్పించకోరి దాఖలు చేసిన పిటిషను దాఖలు చేయుటలో జాప్యము జరిగినందులకు క్షమించమని కోరి పిటిషను దాఖలు చేయగా సదరు నోటీసులో మీకు పేపర్ పబ్లికేషన్ ద్వారా అమలు కాబడుటకు గాను తే 17-10-2025 దీన వాయిదా అయి ఉన్నది. కాబట్టి సదరు దినమున పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10-30 ని॥ లకు హాజరై మీకు గల ఆక్షేపణలు కోర్టువారికి మనవి చేయవలెను లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించడం అగునని తెలియపరచడమైనది.
మద్దు సర్వేశ్వరరావు
వాది తరుపున న్యాయవాది
సోంపేట

ట్రిపుల్ ఐటిలో కలాం ఇన్నోవేషన్ సెంటర్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృష్టి, సాంకేతిక ప్రతిభను పెంపొందించేందుకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సెంటర్‌ను ఆప్షన్‌మేట్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో భాగస్వామ్యంగా ఏర్పాటు చేశారు. ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆప్షన్‌మేట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.శశికుమార్, ట్రిపుల్ ఐటి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఎస్.రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సిహెచ్.వాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతి లక్ష్యం

- నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు
- వ్యవసాయాధారిత పరిశ్రమలకు ప్రాధాన్యం
- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక ప్రగతి సాధించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని వివరించారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

? జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఎలా ఉంది?

ప్రస్తుతం జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 3,922 ఉన్నాయి. అంచనా విలువ రూ.2482.78 కోట్లు. పరిశ్రమల్లో 18,071 మంది పనిచేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా రైస్‌మిల్లులు, ఫ్లోర్ మిల్స్, జీడి ఆధారిత పరిశ్రమలు, స్టోన్ క్రషర్స్, వాటర్ ప్లాంట్స్, గ్రానైట్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. భవిష్యత్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యతనిస్తున్నాం.

? ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తున్నారు?

2025-26లో పిఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా 79 సూక్ష్మ పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు కృషి చేశాం. రూ.మూడు కోట్ల రుణాలు మంజూరు చేశాం. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద రూ.తొమ్మిది కోట్ల విలువైన 1596 కిట్లు మంజూరు చేశాం.

? మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామం అమలు తీరు ఎలా ఉంది?

ఆహార ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం. స్వీట్ కార్న్, మామిడి, పనస, పైనాపిల్, సీతాఫలం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. జి.సిగడాం మండలంలో ఈ ప్రాజెక్టును అమలు చేశాం. రూ.30 కోట్లతో యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

రణస్థలం మండలం పైడిభీమవరంలో ఫార్మా, ఆగ్రో కెమికల్స్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వీటి అంచనా విలువ రూ.400 కోట్లు. 800 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం రాయితీతో స్థలాలు కేటాయిస్తుంది.

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు ఏ దశలో ఉంది?

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పలాస నియోజకవర్గంలోని రామకృష్ణాపురంలో రూ.3.50 కోట్లతో మౌలిక వసతులు సిద్ధం చేస్తున్నాం. పాతపట్నంలో మెళియాపుట్టి పద్ద రూ.2.50 కోట్లతో స్థలాన్ని తీర్చిదిద్దుతున్నాం. శ్రీకాకుళం నియోజకవర్గంలోని పాత్రునివలస వద్ద రూ.నాలుగు కోట్లతో, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పైడిభీమవరం వద్ద రూ.14.60 కోట్లతో ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మిస్తాం. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి అడ్డుకొండలో పిపిపి (ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం) పద్ధతిలో నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి రాజాపురంలో 30 ఎకరాల్లో పార్కుకు స్థలం కేటాయింపు పూర్తయింది. ఆమదాలవలస నియోజకవర్గం వి.ఆర్ గూడెంలో పార్కు నిర్మాణానికి ఎపిఐఐసి ఏర్పాటు చేసింది. నరసన్నపేట నియోజకవర్గంలోని జమ్ము ప్రాంతంలో 30 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కానుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు పెంచాలని, కార్మికులకు రూ.పది వేలు కనీస వేతనం ఇవ్వాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఉత్తర, బి.నుశీల డిమాండ్ చేశారు. కొత్తూరులో మండల అధ్యక్షులు ఉమ అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. అలాగే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు సనప రమేష్, భవాని, కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

నగదు బహుమతిని అందుకుంటున్న సుమిత్‌కుమార్

జాతీయ స్థాయిలో మెరిసిన సుమిత్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఆర్.బెలగాంకు చెందిన రత్నాల సుమిత్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. హైదరాబాదులో కామిత్ కాలేజీలో చదువుతున్న సుమిత్ ముంబాయిలో నిర్వహించిన బ్యాంకు లావాదేవీలు పేమెంట్ డేటాకు సంబంధించిన గ్లోబల్ పిన్ టెక్ ఫెస్ట్ 2025లో పాల్గొని క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేతుల మీదుగా రూ.5 లక్షల నగదు బహుమతితో పాటు అవార్డు అందుకున్నాడు. దీన్ని పురస్కరించుకుని చింతామణి సొండీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు మాట్లాడుతూ సుమిత్ భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర నాయకులు రత్నాల కాశీ విశ్వనాథ చౌదరి, అధ్యక్షులు బెహరా రాజారావు, ప్రధాన కార్యదర్శి రత్నాల శ్రీనివాసరావు, కోశాధికారి, జిల్లా అధ్యక్షులు షావుకారి దివాకరరావు, నియోజవర్గ నాయకులు మొగలిపురి సింహాచలపతి, రత్నాల రామారావు, రత్నాల వెంకటరావు, మొగలిపురి సీతాలు, పాండవ చంద్రశేఖరరావు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అలరించిన సుస్వర సంగీత లహరి

అరసవల్లి: శ్రీకాకుళం మ్యూజిక్, డాన్స్ అక్కడమీ అధ్యక్షులు మావుడూరు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఆదివారం ఇలయరాజా సంగీత ప్రస్తానం 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా సుస్వర సంగీత లహరి పేరిట సినీసంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఘంటసాల, ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం వంటి నేపథ్యగాయకులు తెలుగు భాషకు ఆణిముత్యాలు లాంటి వారని, ఎంతో మంది గాయకులు వారి పాటలు పాడి వీనుల విందు చేస్తున్నారన్నారు. ట్రేక్ సాంగ్స్ పోటీలు, వైలన్ సంగీత కార్యక్రమం నిర్వహించారు. గాయకులను సత్కరించారు. గాయకులు కె. ఉమామహేశ్వరరావు, మార్గదర్శి శ్రీనువాసరావు, కె.ఎల్.ఎన్ మూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, డా. పైడి మాలతి తదితరులు పాటలు పాడి వినిపించారు. రెడ్‌క్రాస్ వైర్మన్ పి. జగన్మోహనరావు, మోహనరావు, పైడి సిందూర తదితరులు పాల్గొన్నారు.

ఎడిఆర్ఎంకి సన్మానం

సోంపేట: ఇటీవల ఉద్యోగోన్నతి పై వాల్తేరు డివిజన్ అదనపు రైల్వే మేనేజర్‌గా ఎర్రముక్కాముకు చెందిన కుందు రామారావు ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. దీంతో గ్రామానికి చెందిన వాడబలిజ సంక్షేమ సంఘం విశాఖపట్నంలో ఆదివారం రామారావును ఘనంగా సన్మానించారు. మాతృభూమి ఎర్రముక్కాం నుంచి వెళ్లిన సుమారు 175 కుటుంబాలు విశాఖపట్నంలో స్థిర నివాసాన్ని ఏర్పరచుకున్నారు. మాతృభూమి అయిన సోంపేట మండలం ఎర్రముక్కాంకు వారు ప్రతి కార్యక్రమాల్లో చేదోడువాదడుగా ఉంటూ మాతృ సంఘానికి ఎన్నో సేవలు అందిస్తున్నారు. ఏటా ఘనంగా వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాతృభూమిలో సేవలను అందించిన వ్యక్తులను గుర్తించి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

సన్మానిస్తున్న సంఘ నాయకులు

నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

పాఠశాలను తెరిపించాలి

మెళియాపుట్టి: మండలంలోని పోలూరు వద్ద ఉన్న మూత పడిన జిపిఎస్ పాఠశాలను తెరిపించాలని స్థానికులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా పిల్లలు తక్కువగా ఉన్నారని ఈ పాఠశాలను ఎత్తివేయడంతో చిన్నారులు దూరపు ప్రాంతంలోని కుడ్డబ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ తిరిగి పాఠశాలను పునరుద్ధరించినట్లయితే చింతలపోలూరు, పోలూరు పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి తిరిగి పాఠశాలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- నిరుపయోగంగా బస్ షెల్టర్లు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

ఉన్నా...లేనట్లే..?

ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. దీంతో ప్రజలకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పలు గ్రామాల్లో వున్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. బస్సుల కోసం వేచి ఉండే ప్రజల సౌకర్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మాణం చేపట్టిన బస్సు షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ధనం వృధా అవుతుందని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన, ప్రధాన కూడళ్ల వద్ద లక్షల రూపాయల వ్యయంతో వీటిని నిర్మించారు. ఆ తర్వాత వాటి ఆలనాపాలన పట్టించుకున్న నాథుడు

పెద్దపేట వద్ద నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్

బస్సు షెల్టర్లను బాగుచేయాలి

బస్సుషెల్టర్లు లేక ప్రతిరోజు ఇబ్బందులకు గురవుతున్నాం. ఎండ, వానలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి బస్సుషెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- నందకిషోర్, విద్యార్థి, బూర్జ

కొరవడి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి, గోడలు, శ్లాబులు, గచ్చులు దెబ్బతిన్నాయి. కనీసం లోపలికి వెళ్లి కూర్చునేందుకు వీలు లేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

కూలడానికి సిద్ధంగా...

మండలంలోని పలు బస్సుషెల్టర్లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. సుమారు పదేళ్ల క్రితం పాలవలస, లక్కుపురం, తుడ్డలి, డొంకలపర్త, బూర్జ, రాజుపేట తదితర గ్రామాల్లో బస్సుషెల్టర్లను రూ.1.50 నుంచి రూ.2 లక్షల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేశారు. కొన్నాళ్ల పాటు ప్రయాణికులకు బాగానే ఉపయోగపడ్డాయి. మరికొన్ని చోట్ల అర్ధాంతరంగా నిర్మాణాలు నిలిచిపోవడంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తు న్నాయి. కొన్నిచోట్ల కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

పంట నిల్వలకు ఉపయోగపడేలా...

పలు గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్సుషెల్టర్లు కొన్ని శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని స్థానికులు వినియోగించుకుంటున్నారు. పలు గ్రామాల్లో రైతులు పండించిన వరి, మొక్కజొన్న వంటి అనేక రకాల పంటలను నిల్వ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కొంతమంది దుకాణదారుల ఆక్రమణతో కనిపించకుండా ఉన్నాయి. కొల్లివలస కూడలి వద్ద బస్సుషెల్టర్ లేకపోవడం విశేషం.

నిరుపయోగంగా షెల్టర్

చాలాచోట్ల బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్నిచోట్ల శిథిలా వస్థకు చేరుకున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బస్సు షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలి.

- శాసపు కళ్యాణి

లక్కుపురం వద్ద పిచ్చిమొక్కల మధ్య ఉన్న బస్సు షెల్టర్

రోడ్లపై ఎదురుచూపులు..

బస్సు షెల్టర్‌లు కొన్ని శిథిలావస్థలో ఉండగా, కొన్ని అర్ధాంతరంగా మధ్యలో నిలిచిపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం రోడ్లపైనే నిలబడి ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ప్రయాణికులకు నిలువ నీడలేక ఎండబారిన పడుతూ, వర్షంలో తడుస్తూ అనునిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్లను బాగు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

రామన్నపేట వద్ద వ్యవసాయ పరికరాలు పెట్టిన రైతులు

'అట్టాడ'కు అభినందనలు

టెక్కలి : టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడావికాస్ కేంద్రంలో నిర్వహిస్తున్న తైక్వాండో కోచింగ్ సెంటర్‌కి చెందిన అట్టాడ మహీధర్‌నాయుడుకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 10, 11 తేదీల్లో గుంటూరు రేపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా నుంచి మహీధర్‌నాయుడు పాల్గొని 38 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. పురస్కారం అందుకున్న మహీధర్ నాయుడు స్థానిక ఆరుణా విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయిలో పాల్గొని పతకం సాధించిన మహీధర్‌నాయుడుని కోచ్ నర్సిపురం, శేఖర్ జనసేన నాయకులు అట్టాడ శ్రీధర్ తదితరులు అభినందించారు.

పాస్టర్లకు సన్మానం

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలోని చర్చిల్లో ఆదివారం అంతర్జాతీయ పాస్టర్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ప్రత్తి అన్వేష్, సోంపేట ఆంధ్రా బాప్టిస్టు చర్చి బిషప్ రెవ, డాక్టర్ కొత్తపల్లి అబ్రహంలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ ప్రెసిడెంట్ ప్రత్తి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక కూడలిలో విద్యుత్ ఉపకేంద్రంలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల సబ్‌డివిజన్ అధికారి ఎస్.శ్రీనివాస్, ఎఇ సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా విరిగిన లేదా వంగిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, ఓల్టేజీ సమస్యలు, లాంగ్‌స్పాన్ లైన్లు, అసాధారణంగా అధిక వినియోగం, ఆధార్ లింక్ లేదా డిసెండింగ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణాలు, సేవలు అందించడానికి లంచం డిమాండ్ చేయడం వంటి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా

టెక్కలి రూరల్ : సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో వెలుగు చూస్తున్న కల్తీ మద్యం కుంభకోణాలపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కమ్ముసన్నల్లోనే కల్తీ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో వద్ద నిర్వహించనున్న ధర్నాకు వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

టెక్కలి రూరల్ : టెక్కలి ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు నేరాల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, ఆటోను శ్రీకాకుళం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యాన ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి రుసుం చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. పాటదారుడు పాడిన పాటకు 18 శాతం జిఎస్‌టి అదనంగా చెల్లించాల్సి ఉంటుదన్నారు

ఆదిత్యుని ఆదాయం రూ.6.06 లక్షలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పలువురు యాత్రికులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, యాత్రికులు ఎండలో ఇబ్బంది పడకుండా ఆలయ అధికారులు టెంట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిక్కెట్ల రూపేనా రూ.3లక్షల 16,500, పూజలు, విరాళాల రూపంలో రూ.80, 073, ప్రసాదాల రూపంలో రూ.2 లక్షల 9, 610 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ, ఉప కమిషనర్ కెవిఎస్‌విడివి ప్రసాద్ తెలిపారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

శ్రీకాకుళం సిటీ: పట్టణంలో ఫాజుల్‌బేగ్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు, మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అనేకసార్లు అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లారు. దీంతో పాటుగా జిల్లాస్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే వృద్ధులు, మహిళలు ప్రధా నంగా ఇబ్బంది పడుతున్నారు. రన్నింగ్ నీటి సౌకర్యం తో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.



ఫాజుల్‌బేగ్ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలోని యువతీ, యువకులకు సూపర్ సిక్స్‌లో భాగంగా 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో ఎంపికైన నియోజకవర్గానికి చెందిన నూతన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ నుంచి ప్రస్తుత డిఎస్‌సిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వ కారణమన్నారు. నియోజకవర్గ పరిధిలో 66 మంది ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంపిక కావడం ఆనందకరమని పేర్కొన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో 50 మంది మహిళలు ఉండడం విశేషమన్నారు. ఎంపికైన వారిలో ఎక్కువ మంది ఆదివాసీ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని ఒక బాధ్యతగా భావించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు ఎంపికలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు ఈ నెల 15లోపు విధుల్లో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ రామ్మోహనరావు, సూరపు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, పిఏసిఎస్ చైర్మన్ శిమ్మ మాధవి, టిడిపి నాయకులు సనపల ధిల్లేశ్వరరావు, నూకరాజు, అన్నెపు భాస్కరరావు, పల్లి సురేష్, సంపదరావు మురళి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై సిబిఐ విచారణ చేయాలి

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకలచెరువు గ్రామంలో కల్తీ మద్యం మాఫియా ఏర్పాటు చేసిన డిస్టిలరీ వెనుక టిడిపి పెద్దల చేతులు ఉన్నాయనే విషయం వెలుగుచూసిందని ఆరోపించారు. విజయవాడ, ఏలూరు, అమలాపురం వంటి ప్రాంతాల్లో కూడా నకిలీ మద్యం సరఫరా జరుగుతోందని, ఈ వ్యవహారంలో గత ఎన్నికల్లో తంబళ్లపల్లి టిడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి, ఆయన బామ్మర్ది గిరిధర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సురేంద్ర రెడ్డిలు ప్రధాన నిందితులని తెలిపారు. గతంలో సురేంద్రరెడ్డికి హత్యకేసులో శిక్ష పడితే అప్పట్లో సిఎం చంద్రబాబు ఆయనకు క్షమాభిక్ష ఇచ్చి విడుదల చేశారన్నారు. ఇంత పెద్ద స్థాయిలో నకిలీ మద్యం సరఫరా ప్రభుత్వ పెద్దల సహకారం లేకుండా ఎలా జరుగుతుందని చింతాడ ప్రశ్నించారు. ఎక్సైజ్ అధికారుల దర్యాప్తులో ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం కల్తీదారుల చేత తయారవుతున్నట్లు తేలిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా క్రమబద్ధమైన అమ్మకాలు జరిగాయని, ఇప్పుడు టిడిపి పాలనలో బెల్టుషాపులు విస్తరించి, రూ.99 మద్యం బాటిళ్ల మద్యంషాపుల్లో కాకుండా బెల్టుషాపుల్లో లభిస్తున్నాయని విమర్శించారు. ఆధారాలు లేని 'లిక్కర్ స్కామ్' పేరుతో వైసిపి నాయకులను అరెస్టు చేయడం వేధించడం దారుణమన్నారు. జయచంద్రారెడ్డి వైసిపి కోవర్టు అని టిడిపి చెబుతుందని, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్థసారథి వంటి నాయకులు టిడిపిలో ఉన్నారని వాళ్ల కోవర్టులు కారా అని ప్రశ్నించారు. టిడిపి చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలందరూ గ్రహించాలన్నారు. సోమవారం ఉదయం నకిలీ మద్యం వ్యవహారంపై వైసిపి అధిష్టానం పిలుపుమేరకు పట్టణంలోని బైక్‌ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు దుంపల శ్యామ్, కొప్పుల ఈశ్వరరావు, అన్నెపు సంజీవరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట పట్టణంలో 12వ వార్డు శివనగర్ కాలనీలో పరిధిలో రూ.1.50 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు కుళాయి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి చేసే దిశగా అన్ని విధాల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, శిమ్మ చంద్రశేఖర్, జామి వెంకటరావు, గొద్దు చిట్టిబాబు, ఊన్న వెంకటేశ్వరరావు, మధు, సాసుపల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సూర శ్రీనివాసరావు ఈ ఎంపిక పక్రియను ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో 20 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఈ నెల 28 నుంచి నవంబర్ 6 వరకు ఇస్తారన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పంపిస్తారు. గూంటూరు జిల్లా పిడుగు రాళ్లలో నవంబర్ 8 నుంచి 10 వరకు స్టేట్ మీట్ పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఛీప్ అడ్వజరీ సుందరరావు, కన్వీనర్ ఎంవి రమణ, మెట్ట తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

ప్రజాశక్తి- కవిటి

గాయపడిన నాగేశ్వరరావు

గ్రామ సింహాలు బెంబేలె త్తిస్తున్నాయి. ఇబ్బడి పబ్బడి పెరిగిపోయిన కుక్కలు ఇక మనుషులపై దాడులు చేస్తున్నాయి. మండలంలోని మాణిక్యపురంలో గత రెండు రోజులుగా 11 మంది కుక్కల దాడిలో గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం మోహన్ బిసాయి, శృంగవరపు నాగేశ్వరరావుపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రస్తుతం వీరు సోంపేట కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజలు ప్రాణాలు కోల్పోకుండానే కుక్కల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రాణాల కోసం పోరాడారు

కొంచెం ఆలస్యమైతే మా నాన్న ప్రాణాలకే ప్రమాదం. కాలుపై దాడి చేయడంతో మానాన్న కింద పడిపో యారు. దీంతో మొహంపై దాడి చేశాయి. స్థానికులు గమనించకపోతే ప్రాణాలకే ప్రమాదం వచ్చేది. ప్రభుత్వాలు స్పందించి కుక్కల బారినుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

- సంతోష్, మాణిక్యపురం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మందస, బారువ రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందినట్లు పలాస రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం రైలు కింద పడి మృతి చెందాడని, ఆదివారం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అనంతరం పలాస ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టానికి తరలించామన్నారు. ఆయన ఛాతీపై ఐలవు స్వాతి అనే పచ్చబొట్టు తెలుగులో రాసి ఉందన్నారు. ఆయనకు చెందిన సమాచారం తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

చిరంజీవి (ఫైల్)

మండలం లోని గెద్దలపాడుకు చెందిన చిరంజీవి (23) రాజమండ్రిలో శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. రాజమండ్రి లోని సోములమ్మ గుడి మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా శనివారం రాత్రి లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్వగ్రామమైన గెద్దలపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- నందిగాం

మండలం లఖిదాసుపురానికి చెందిన లోకనాథం సుస్మిత అదృశ్యమైనట్లు ఆమె పెద్దనాన్న వాసుదేవరావు ఆదివారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ షేక్ అహ

మద్యం దుకాణాల్లో తనిఖీలు

రణస్థలం రూరల్ : మద్యంషాపును తనిఖీ చేస్తున్న సిఐ అనురాధ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రణస్థలం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో 15 మద్యం దుకాణాల నుంచి కెమికల్ ఎనాలసిస్ విశాఖపట్నం పంపేందుకు శాంపిల్స్ సేకరించడం జరిగిందని రణస్థలం ఎక్సైజ్ సిఐ ఎల్.అనురాధ తెలిపారు. ఆదివారం లావేరు, రణస్థలంలో మద్యం షాపులను తనిఖీ చేశారు. రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యం అందించేందుకు ఎప్పటికప్పుడు మద్యం షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 135 శాంపిల్స్ కెమికల్ ఎనాలసిస్ చేయు నిమిత్తం విశాఖపట్నం లేబోరేటరీకి పంపించి వాటి నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే 14405 నెంబర్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సిఐ రమణ అన్నారు. మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు ప్రతి స్టేషన్ పరిధిలో మద్యం షాపుల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. మద్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించాక అక్కడికక్కడే నమూనాలను పరీక్షించి ఆ తరువాత రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబొరేటరీకి పంపిస్తున్నామని తెలిపారు. ఇందులో

సోంపేట : మాట్లాడుతున్న సిఐ రమణ

భాగంగా గత అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు 101 నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామన్నారు. నియోగదారులకు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 14405కి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.

పలువురు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మండలంలోని కొఠారికి చెందిన బండారు పావని కుమార్తె దీయా న్యూమోనియా వ్యాధితో బాధపడుతుంది. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. చిన్నారని తల్లితండ్రులు కూలి పనులు చేస్తూ... జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ యువత, ఎస్‌జిఎఫ్ స్పందించి రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన జామాన వాసు గాయపడి స్పాండైలైటిస్ ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు వాసును పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు రూ.52,500 నగదును వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు, రౌతు బాలరాజు, దారపు పాపారావు, ఎన్ని షణ్ముఖరావు, దారపు ధర్మారావు, రట్టి ఖైరాగి, పోలాకి తిరుపతిరావు, ముప్పర్తి కృష్ణారావు, పొట్నూరు గుణాకరరావు, పెదరట్టి మణి పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో శ్రీ'విజేత'

కవిటి : టెక్కలిలోని ఆల్ఫా జెన్ పాఠశాలలో వేదం ఇంటర్నేషనల్ ఎఐ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత, మైతోలాజికల్ క్విజ్ పోటీల్లో జాడుపూడి ఆర్ఎన్‌కు చెందిన శ్రీవిజేత పాఠశాల విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. ఈ పోటీలో పాఠశాలకు చెందిన శివసాయి సాహు ప్రథమ బహుమతిని, సాలిన లోకేశ్వర రావు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి.రాంకుమార్, బి.విజయభాస్కర్ విద్యార్థులను అభినందిస్తూ 'భగవద్గీత సారాన్ని అర్థం చేసుకుని పిల్లలు సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని' అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బి.అనిత, పి.రమ్యశ్రీ పాల్గొన్నారు.

డిసెంబర్ 21న ఘంటసాల ఆరాధనోత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

డిసెంబర్ 21న ఘంటసాల ఆరాధనోత్సవాలు హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ చెందిన ప్రతినిధులు ఎం.రఘురాం, సుబ్బారావు తెలిపారు. ఆదివారం వరసిద్ధి వినాయక ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. నగరంలో అంబేద్కర్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతిక సమితి, కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్తంగా రాష్ట్రస్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 గంటల పాటు నిర్విరామంగా ఘంటసాల స్వరపరిచిన సినీ గీతాలను అనేక మంది గాయకులతో పాటలు పాడించి ఆరాధన ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రముఖ గాయకులు కారుణ్య కూడా ఆ కార్యక్రమంలో గంటసేపు ఘంటసాల గీతాలు ఆలపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు, విశ్రాంత ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, ఐతం కళాశాల ప్రొఫెసర్ విష్ణుమూర్తి, జంధ్యాల శరత్ బాబు, గాయకులు కళ్యాణ రామ్మోహన్, మండ వెంకట కామేశ్వరరావు, రఘుపాత్రుని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సంతకాల సేకరణ

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల వ్యవహారంలో అనుసరిస్తున్న ప్రైవేట్ తప్పుడు విధానాలకు నిరసిస్తూ జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సంతకాలు సేకరించారు. మండలంలోని కొఠారి, కేశుపురం గ్రామాల్లో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర, ఎంపిపి బోర పుష్ప, కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, సల్ల దేవరాజ్, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, భాగ మోహనరావు, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, యాదవ రెడ్డి, దుక్క ఆనంద్ పాల్గొన్నారు.

కవిటి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు పిరియా సాయిరాజ్ మండలంలోని వరకలో ఆదివారం సంతకాలు సేకరించారు. అనంతరం గ్రామస్థాయి కమిటీలకు

ఇచ్ఛాపురం : సంతకాలు సేకరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో బడుగు, బలహీన తరగతులకు వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో కమిటీలు ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో యువ నాయకుడు శ్రీకాంత్ పురియా, దూదయ్య, జి.పురుషోత్తం, బి.రాజేంద్ర, బి.జగదీష్, గణప శివాజీ, జగదీష్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే సమాజం మార్పు

ప్రజాశక్తి- మందస

పుస్తకాలతోనే సమాజం మార్పు చెందుతుందని వక్తలు అన్నారు. మండలంలోని హరిపురంలో స్టార్ హెల్త్ ఇన్యూరెన్స్ కార్యాలయంలో ప్రజా విజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహనరావు అధ్యక్షతన వర్తమానం నుంచి గతంలోకి పుస్తక పరిచయ సభను ఆదివారం నిర్వహించారు. పుస్తక పరిచయకర్తలుగా రజితేంద్రరెడ్డి, సామాజిక కార్యకర్త మట్ట ఖగేశ్వరరావు వ్యవహరించారు. రజితేంద్రరెడ్డి పుస్తకాన్ని స్థూలంగా సమీక్షించారు. సమాజంలో ఒక విలువైన పుస్తకంగా నిలుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైన అంశం ఆలోచన ఈ ఆలోచనల్లో వర్గ స్వభావాన్ని అర్థం చేసుకున్నప్పుడే సమాజాన్ని అభివృద్ధి పథంలో నడపగలమన్న విశ్లేషణ అత్యంత గొప్పదని అన్నారు.

అనేక రుగ్మతలను కర్మ సిద్ధాంతాలతో ముడిపెట్టిన ఆశాస్త్రీయ అంశాలను వెలికి

మాట్లాడుతున్న ఖగేశ్వరరావు

తీసిన అంశాలను సమాజంలో అందరికి తెలిసేటట్టు మనం ప్రయత్నం చేయాలన్నారు. అప్పుడే రచయిత చేసిన తీవ్రమైన కృషి సాఫల్యం చెందుతోందన్నారు. శ్రమ పడే వాళ్లని అనగదొక్కడమే మూఢనమ్మకాల అంతిమ లక్షణమని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పుస్తకం గడిచిన చరిత్రకు అద్దం పడుతోందన్నారు. అందరూ ఈ పుస్తకాన్ని చదవాలని విజ్ఞప్తి చేశారు. భూమి ఉత్పత్తిలో కీలకమైన అంశమని, అలాంటి భూమిని ప్రజలకు దూరం చేసి బానిసలుగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా సెక్రటరీ గున్న రమేష్ చౌదరి హేమారావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.భీమారావు సమాజంలో పుస్తకం ఆవశ్యకత గురుంచి మాట్లాడారు. యుటిఎఫ్ నాయకులు ఈశ్వరరావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో గొలుసు మురళి, దాసరి తాతారావు, దువ్వాడ దామోదరం, రైతు చిరంజీవిలు, మార్పు వెంకటరమణ, డి.వెంకటరావు, మార్పు మన్మథరావు, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు నాగమణి పాల్గొన్నారు.

కళింగ వైశ్యులను గుర్తించింది జగనే

శ్రీకాకుళం సిటీ: కళింగ వైశ్యులను గుర్తించిన నాయకుడు మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని వైసిపి శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు అన్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం కళింగ వైశ్యుల సామాజిక తరగతి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జిల్లాలో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ పరిశోధన కేంద్రం, మూలపేట పోర్టు, ఫిషింగ్‌హార్బర్లు తీసుకొచ్చిందన్నారు. జిల్లాకు దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రమే ప్రగతికి కృషిచేశారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదన్నారు. ఎరువులు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైన చంద్రబాబు ప్రభుత్వంను రైతుల క్షమించరన్నారు. వైసిపి కళింగవైశ్యల రాష్ట్ర అధ్యక్షులు అందవరపు సూరిబాబు మాట్లాడుతూ సామాజక తరగతి ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. మరలా జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు, రవిరాజ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

పలువురు పరామర్శ

ఇచ్ఛాపురం : మండలంలో లొద్దపుట్టి ఎంపిటిసి ప్రతినిధి, వైసిపి నాయకులు పిట్ట ఆనంద్‌కుమార్ తండ్రి హరిశ్చంద్రరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాంపత్రి చిట్టిబాబు, మండపల్లి సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్య, కేసుపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు తిప్పన నాగరాజురెడ్డి, 9 వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను టిడిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. జాడుపల్లిలో వంజంగి బోగెస్ తల్లి ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. రాయికోలకు చెందిన టిడిపి నాయకులు సవర సుంకన్న ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, టిడిపి మండల అధ్యక్షులు నంభాల వెంకటరావు, ఎంపిటిసి కదంభాల పైడిరాజు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

మందస: గో గ్రీన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన పాత తహశీల్దార్ కార్యాలయం నుంచి శాసనం వీధి కూడలి వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామనిసంఘ సేవకులు, గో గ్రీన్ సభ్యులు గిన్ని తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మొక్కలు నాటామన్నారు. జనసేన జిల్లా నాయకులు గో గ్రీన్ సభ్యులు సంతోష్ పండా మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా మెయిన్ రోడ్డును పచ్చగా తీర్చిదిద్దడం అవుతుందని అన్నారు. గో గ్రీన్ ప్రతినిధి సిహెచ్.లక్ష్మణ రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. నీల్- మోహన్ రిసోర్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పట్నాల మొహనాచారి ఆర్థిక, హార్థిక సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మామిడి కోదండరావు, శ్రీనివాస్ పాడి, రామారావు, సింహాచలపతి, మల్లారెడ్డి రాజు, దున్న హరికృష్ణ, కె.ప్రసాద్, నాగేశ్వరరావు, పొందూరు కేశవరావు, రాధాకృష్ణ పట్నాయక్, ఇప్పిలి చిట్టి, హరి పాల్గొన్నారు.

మొక్కకు కంచె ఏర్పాటు చేస్తున్న సభ్యులు